సాక్షి
అన్నమయ్య జిల్లా

గురువారం । 20 । ఏప్రిల్ । 2023



సమ్మెటివ్‌కు సర్వం సిద్ధం

ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులకు వార్షిక పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. -8లో..



కువైట్ నుంచి మదనపల్లెకు ..

బతుకుతెరువు కోసం ఎడారిదేశాలకు వెళ్లి, అనారోగ్యం పాలై కోమాలోకి చేరుకున్న ఓ అభాగ్యుడిని ఇంటికి చేర్చి మానవత్వం చాటుకున్న ఘటన ఇది -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.74	రూ.90
రెండోరకం	రూ.50	రూ.72



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 224 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	322	461
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 100.86 కిలోలు

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురు (సా॥)	సహర్ శుక్ర (ఉ॥)
రాజంపేట	6.33	4.39
రాయచోటి	6.34	4.36
మదనపల్లి	6.35	4.38
పీలేరు	6.32	4.31

న్యూస్‌రీల్

ఐదుగురు సచివాలయ సిబ్బంది సస్పెన్షన్

పీలేరు: ఓటరు ఆధార్ అనుసంధానం చేయడంలో నిర్లక్ష్యం వహించిన ఐదుగురు సచివాలయ సిబ్బందిపై వేటు పడింది. వారిని విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. పీలేరు ఒకటో గ్రామ సచివాలయంలో పని చేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్ మహేంద్రకుమార్, నాలుగో గ్రామ సచివాలయంలో పని చేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్ అశ్విని, వేపులబైలు గ్రామ సచివాలయంలో పని చేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్ దుర్గా ప్రసాద్‌రెడ్డి, పీలేరు మూడో గ్రామ సచివాలయంలో పని చేస్తున్న కార్యదర్శి నవీన, గూడరేవుపల్లె గ్రామ సచివాలయంలో పని చేస్తున్న కార్యదర్శి మహేష్‌లను విధుల నుంచి తొలగించారు.


పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభం

రాయచోటి : అన్నమయ్య జిల్లా రాయచోటిలో పదో తరగతి జవాబు పత్రాల ముల్యాంకనం ప్రారంభమైంది. రాయచోటిలోని సాయి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ప్రారంభమైన మూల్యాంకన ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఈఓ పురుషోత్తం వెల్లడించారు. బుధవారం నుంచి 26వ తేదీ వరకు (స్పాట్) మూల్యాంకన ప్రక్రియ జరుగుతుందన్నారు. మొదటిరోజు మూల్యాంకనం ప్రశాంతంగా సాగిందన్నారు. మూల్యాంకనానికి హాజరుకాని ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీఈఓ తెలిపారు.

పసుపు రైతులు ఆర్బీకేల్లో నమోదు చేసుకోవాలి

రాయచోటి : పసుపు పంటను సాగు చేసిన రైతులు పంట విక్రయానికి సమీప రైతు భరోసా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలని అన్నమయ్య జిల్లా ఏపీ మార్క్ ఫెడ్ మేనేజర్ టి.త్యాగరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజంపేట, కోడూరు, చిట్వేల్, నందలూరు, పుల్లంపేట, పెనగలూరు, వీరబల్లి, ఓబులవారిపల్లె మండలాల్లో 827 ఎకరాలలో 667 మంది రైతులు పసుపు పంటను సాగు చేశారన్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో క్వింటాకు రూ.4800 నుంచి రూ.5200 వరకు ఉందన్నారు. ప్రభుత్వం క్వింటాకు కనీస మద్దతు ధరగా రూ.6850 ఇస్తుందన్నారు.

ఆధార్ అనుసంధాన ప్రక్రియ వందశాతం పూర్తి చేయాలి



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గోపాలకృష్ణ

పీలేరు : ఓటరుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ వందశాతం పూర్తి చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గోపాలకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఓటరు అనుసంధాన ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవి, డీటీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీఎల్ కంపెనీలో ఉద్యోగావకాశాలు

రాయచోటిటౌన్ : ఇంటర్ పూర్తి చేసిన యువతీ యువకులకు హెచ్‌సీఎల్ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మ్యాథ్స్‌లో /బిజినెస్ మ్యాథ్స్‌లో 60 శాతం మార్కులు సాధించిన వారు హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రోగ్రాంకు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ కాలం ఒక సంవత్సరం ఉంటుందన్నారు.

మే ఆరు నుంచి అన్నమయ్య జయంతి ఉత్సవాలు

బి.కొత్తకోట: రాజంపేటలో తాళ్లపాక అన్నమయ్య 615వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారని జిల్లా పర్యాటక అధికారి ఎం.నాగభూషణం తెలిపారు. బుధవారం ఆయన స్థానిక మేనేజర్ నేదురుమల్లి సాల్విన్‌రెడ్డితో కలిసి బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్‌లో పర్యాటకశాఖకు చెందిన పట్టుశాఖ భవనాలను పరిశీలించారు. ఈ భవనాలను ఒబెరాయ్ సంస్థకు అప్పగించాల్సి ఉండటంతో వీటి స్థితిగతులను పరిశీలించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అన్నమయ్య జయంతి ఉత్సవాలను మే ఆరవ తేదీనుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు.

లోకం విడిచి.. శోకం మిగిల్చి

ఉమ్మడి వైఎస్సార్ జిల్లా కన్నీరు పెట్టుకుంది. బుధవారం వేర్వేరు ప్రాంతాల్లో రైలుకిందపడి ఐదుగురు ఆత్మహత్య చేసుకున్నారు. ఓ చోట వేధింపులు.. మనస్తాపం కారణంగా 'నవ' దంపతులు తమ నిండు ప్రాణలు వదలగా.. మరో చోట అప్పులబాధతో మరోవ్యక్తి.. ఇంకోచోట మరో ఇద్దరు ఇతర కారణాలతో బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఈ హృదయ విదారక సంఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు.

- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో వేర్వేరు చోట్ల రైలు కింద పడి ఐదుగురి ఆత్మహత్య
- వేధింపులు.. ఆర్థిక సమస్యలే ప్రధాన కారణం
- మృతుల్లో నవ దంపతులు
- శోకసంద్రంలో కుటుంబీకులు



శోకసంద్రంలో మృతుల కుటుంబసభ్యులు, బంధుమిత్రులు (ఇన్‌సెట్) మృతుల కుటుంబీకులను ఓదార్చుతున్న రాష్ట్ర అటవీశాఖ డైరెక్టర్ రామనశ్రీలక్ష్మి



సాయికుమార్‌రెడ్డి, హేమమాలిని పెళ్లి ఫొటో (ఫైల్)

కడప కోటిరెడ్డిసర్కిల్/చెన్నూరు: చెన్నూరు మండలం రామనపల్లె గ్రామానికి చెందిన గాజులపల్లె సాయికుమార్‌రెడ్డి (29), డి.హేమమాలిని (27) దంపతులు మంగళవారం రాత్రి కడప నగర శివార్లలోని కనుమలోపల్లె సమీపంలో రాయలసీమ ఎక్స్‌ప్రెస్ కింద పడి ప్రాణాలు తీసుకున్నారు. రైల్వే ఎస్‌ఐ రారాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చెన్నూరు మండలానికి చెందిన సాయికుమార్‌రెడ్డి కడపకు చెందిన హేమమాలినిని తొమ్మిది నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం హేమమాలిని ఏడు నెలల గర్భిణిగా ఉన్నారు. వివాహమైనప్పటి నుంచి వీరిరువురు కడప నగరంలోని విజయదుర్గ కాలనీలో నివాసమంటున్నారు. సాయికుమార్‌రెడ్డి వాటర్ బాటిల్ సరఫరా చేసే ఓ కంపెనీ తరుపున కమీషన్ ఏజెంటుగా పనిచేస్తుండగా, ఆయన సతీమణి హేమమాలిని మరియాపురంలోని రియల్ ఎస్టేట్ కార్యాలయంలో ఉద్యోగిగా పనిచేస్తూ జీవనం సాగించేవారు. దంపతుల ఆత్మహత్య సంఘటనపై కేసు నమోదు చేసినట్లు రైల్వే ఎస్‌ఐ రారాజు తెలిపారు.

వేధింపులే కారణం..

తన కుమారుడు, కోడలి ఆత్మహత్యకు పాలెంపల్లెకు చెందిన నారాయణస్వామి అనే వ్యక్తి వేధింపులే కారణమని మృతుడు సాయికుమార్‌రెడ్డి తల్లి వరలక్ష్మి ఆరోపించారు. ఆమె కథనం మేరకు.. చెన్నూరుకు చెందిన వరలక్ష్మి, రమణారెడ్డి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. తన భర్త రమణారెడ్డి మరణంతో ఆమె పుట్టినిల్లయిన రామనపల్లెకు వెళ్లి అక్కడే ఉంటోంది. తన తల్లిదండ్రుల ద్వారా వచ్చిన భూమిని సాయికుమార్‌రెడ్డి కడప నగరం పాలెంపల్లెకు చెందిన నారాయణస్వామి అనే వ్యక్తికి రూ. 3 లక్షలకు తాకట్టు పెట్టాడు. తాకట్టు పెట్టేముందు తన డబ్బు వడ్డీతో సహా ఎప్పుడైనా చెల్లించాలని, మీ భూమిని మీకు తిరిగి ఇస్తానని అతను చెప్పాడు. ఇటీవల డబ్బు తీసుకుని వెళ్లి తన భూమి తనకు ఇవ్వాలని సాయికుమార్‌రెడ్డి నారాయణస్వామిని అడుగగా అతను ఇవ్వక పోగా అనేక విధాలుగా ఇబ్బంది పెట్టాడు. ఇందుకు సంబంధించి పంచాయతీలు కూడా జరిగాయి. అయినా ఫలితం లేదు. దీనికితోడు నారాయణస్వామి తన అనుచరుల చేత అనేకమార్లు బెదిరించి దుర్భాషలాడాడు. తన భూమిని అక్రమంగా తీసుకోవడమే కాకుండా తనను మానసికంగా వేధించడంతో మనస్థాపానికి గురయ్యాడు. ఇక తనకు న్యాయం జరగదని తెలిసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎంతో అన్యోన్యంగా జీవిస్తున్న తమ కుటుంబం నారాయణస్వామి వేధింపులతో చిన్నాభిన్నమైందని వరలక్ష్మి కన్నీరు మున్నీరైంది.

గ్రామంలో విషాద ఛాయలు

ముక్కుపచ్చలారని యువ దంపతులు ఆత్మహత్య చేసుకున్నారన్న వార్త మండల వ్యాప్తంగా వ్యాపించడంతో అటు రామనపల్లె, ఇటు చెన్నూరు భవానీనగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలను కడసారిగా చూసేందుకు గ్రామస్తులు భారీగా తరలివచ్చారు. బంధువులు, స్నేహితులు గ్రామస్తులు బోరున విలపించారు. నిండు గర్భిణి అయిన హేమమాలినిని చూసి గ్రామస్తులు చలించిపోయారు. సాయంత్రం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తులు, ఆత్మీయుల మధ్య దంపతుల మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. కాగా రాష్ట్ర అటవీశాఖ డైరెక్టర్ రామన శ్రీలక్ష్మి యువ దంపతుల మృతదేహాలను చెన్నూరుకు గతిసుకొచ్చి అంత్యక్రియలు ముగిసేవరకు దగ్గరుండి మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు.

రాజంపేటలో ఎల్ఐసీ ఏజెంట్..

రాజంపేట: రాజంపేట రైల్వేస్టేషన్‌లో ఎల్‌ఐసీ ఏజెంట్ కేవీ రమణయ్య(58) బుధవారం రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో తల, మొండెం వేరయ్యాయి. సమాచారం అందుకున్న రేణిగుంట రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసినట్లు రేణిగుంట జీఆర్పీ ఎస్‌ఐ అనిల్ తెలిపారు. మృతికి గల కారణాలు దర్యాప్తులో వెలుగు చూస్తాయని వెల్లడించారు. మృతుని స్వగ్రామం రైల్వేకోడూరు నియోజకవర్గం పుల్లంపేట మండలం వత్తలూరుగా గుర్తించారు. ప్రస్తుతం రాజంపేట పట్టణంలో నివాసం ఉంటున్నాడు. మృతునికి భార్య సుబ్బమ్మ, ఇద్దరు సంతానం ఉన్నారు.



రైలుకిందపడి మృతిచెందిన రమణయ్య

అప్పల వారి ఒత్తిడి అధికమై..



రైలు కిందపడి మృతి చెందిన మోహన్‌రాజు

కడప కోటిరెడ్డిసర్కిల్ : లక్కిరెడ్డిపల్లె మండలం రాచపల్లె గ్రామానికి చెందిన ముద్దలూరు మోహన్‌రాజు గతంలో జీవనోపాధి నిమిత్తం కువైట్‌కు వెళ్లాడు. ఇటీవల స్వదేశానికి చేరుకున్న రాజు రాయచోటిలో ఓ హోటల్ నిర్వహిస్తుండేవాడు. ఈ క్రమంలో పలువురి వద్ద అప్పులు చేశాడు. అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి అధికం కావడంతో దిక్కుతోచని స్థితిలో కడప–కృష్ణాపురం మార్గమధ్యంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

గుర్తుతెలియని దివ్యాంగుడు..

కడప–భాకరాపేట రైల్వేస్టేషన్ మధ్య సుమారు 45 సంవత్సరాల వయస్సుగల దివ్యాంగుడు కదులుతున్న రైలు కింద పడి మృతి చెందాడు. మృతుడు జైపూర్ ప్లాస్టిక్ కాలు కలిగి ఉన్నాడు. మృతదేహాన్ని గుర్తించిన వారు కడప రైల్వే పోలీసులకు (సెల్ నంబరు 94406 46974 లేదా స్టేషన్ రైటర్ 9502051021) సమాచారం అందించాలని ఎస్‌ఐ రారాజు కోరారు.



రైలు కిందపడి మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

మైనార్టీలకు అండగా ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, చిత్రంలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ మిథున్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల

రైల్వేకోడూరు : మైనార్టీలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని రాజ్ కన్వెన్షన్ హాల్‌లో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ముస్లింలకు ఇచ్చిన ఇఫ్తార్ విందుకు ఎంపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర మాసంలో ముస్లింలు చేపట్టిన దీక్షలు మంచి ఫలితాలు ఇవ్వాలని ఆకాంక్షించారు. దేశంలోనే తొలి సారిగా ఇమామ్‌లకు గౌరవవేతనం అందిస్తున్న ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మైనార్టీలంటే జగనన్నకు ప్రత్యేక అభిమానం అని, వైఎస్సార్‌సీపీ అంటే మైనార్టీల పార్టీ అని వివరించారు. గతంలో మైనార్టీలకు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి రిజర్వేషన్లు కల్పించారని, నేడు ఆయన తనయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల ఆర్థికాభివృద్ధికి పలు పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ మైనార్టీ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ ఇక్బాల్, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, సందీప్‌రెడ్డి, హేమనవర్మ, వేణుగోపాల్‌రాజు, ఉప సర్పంచ్ తోట శివసాయి, జిల్లా కోఆప్షన్ సభ్యులు వైఎస్ అన్వర్‌బాషా, మస్తాన్‌బాషా, ముజీబ్, షేక్ షావలి, సలాం పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్ భూములపై ఎవరికీ హక్కుల్లేవు

- వినోదాల కేంద్రంగా తీర్చిదిద్దుదాం
- శాఖల మధ్య సమన్వయం పెంచుకోవాలి
- టౌన్‌షిప్ కమిటీ సమావేశంలో ఆర్డీఓ మురళీ



హార్సిలీహిల్స్‌పై అధికారులతో పరిశీలనలు చేస్తున్న ఆర్డీఓ మురళీ

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్‌పై ప్రభుత్వశాఖలకు కేటాయించిన భూములను ఆశాఖ వినియోగించుకోవచ్చని, వాటిపై శాశ్వత హక్కు ఉండదని మదనపల్లె ఆర్డీఓ, హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ కమిటీ చైర్మన్ ఎంఎస్.మురళీ అన్నారు. బుధవారం ఆయన హార్సిలీహిల్స్‌పై కాలినడక సమస్యలు, పారిశుధ్య నిర్వహణ, భూముల ఆక్రమణలను పరిశీలించారు. అనంతరం ఆయన అధ్యక్షతన కాన్ఫరెన్స్ హాలులో కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రగతి, సమస్యలపై సమీక్షిస్తూ మాట్లాడారు. భూములు పొందిన శాఖల అధికారులు ఆ భూముల్లో సందర్శకులను ఆకట్టుకునే కార్యక్రమాలను అమలు చేసుకోవాలని, తద్వారా ఆదాయం పెంచుకోవాలని సూచించారు. కుటుంబాలతో వచ్చే సందర్శకులు ఒకరోజు విడిది చేసేలా వినోద కార్యక్రమాలు ఉండాలన్నారు. అధికారులు సమన్వయంతో ప్రణాళికలు రూపొందించి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కొండపై ప్రకటనల బోర్డులు పెట్టుకోవడానికి అనుమతి ఇస్తామన్నారు. హైమాస్‌లైట్లు రాత్రివేళల్లో వెలిగేలా ఆటోమెటిక్ సిస్టం అమర్చుతామన్నారు. అక్రమ నిర్మాణాలకు టౌన్‌షిప్ కమిటీ పేరుతో మీటర్లు అమర్చాలని డిస్కం అధికారులకు సూచించారు. ఏనుగుమల్లమ్మ ఆలయం వద్ద కల్యాణమండపం నిర్మాణానికి అనుమతి ఇస్తామన్నారు. కొండపైనుంచి బండరాళ్లు ఘాట్‌రోడ్డుపై పడకుండా రక్షిత గోడలను నిర్మించాలని రహదారి భవనాలశాఖ అధికారులకు చెప్పారు. శానిటోరియం భూమిని స్వాధీనం చేసుకునే చర్యలు చేపట్టాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. టూరిజం డీపీఎం మడితాటి గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ కొండపై సందర్శకుల కోసం ఫన్ జోన్, కంప్యూటర్ గేమింగ్, సింగిల్ పోల్ బాస్కెట్ బాల్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్‌ఐ రామమోహన్ మాట్లాడుతూ కొండపై ఒక ఎస్‌ఐ, ఎనిమిది మంది సిబ్బంది విధులు నిర్వహించేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. ప్రస్తుతం టూరిజం టూరిస్ట్ పోలిసింగ్ విధానం అమలులో ఉందని, ఆరుగురు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. డీటీఓ నాగభూషణం, టూరిజం మేనేజర్ నేదురుమల్లి సాల్వేన్‌రెడ్డి, డిస్కం ఈఈ రాజశేఖర్‌రెడ్డి, ఫారెస్టు రేంజర్ మదన్‌మోహన్‌రెడ్డి, సెక్షన్ ఆఫీసర్ అడపా శివకుమార్ ,ఆర్‌అండ్‌బీ ఈఈ అరవిందాదేవి, పంచాయతీరాజ్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ ధనుంజయలు, ఎంపీడీఓ శంకరయ్య, డీఎం వెంకటరమణారెడ్డి, హార్టికల్చర్ అధికారి ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి
- ఘనంగా మార్కెట్ కమిటి చైర్మన్ సుబ్బరామరాజు ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న సుబ్బరామరాజు, చిత్రంలో ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గడికోట, కొరముట్ల

రైల్వేకోడూరు: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. రైల్వేకోడూరు నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఘనంగా నిర్వహించారు. రైల్వేకోడూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ముద్దులూరు సుబ్బరామరాజు, వైస్ చైర్‌పర్సన్‌గా కమలమ్మ , 13 మంది కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మొక్కుబడిగా మార్కెట్ కమిటీలు ఉండేవన్నారు. నేడు వాటిని బలోపేతం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీకి అవసరమైన నిర్మాణాలకు, రైతులకు ఉపయోగపడే పనులకు నిధులు మంజూరు చేసి అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఏవైతే హామీలు ఇచ్చారో అధికారంలోకి రాగానే సీఎం జగన్ ప్రతి ఒక్కటీ నెరవేర్చారని తెలిపారు. ముఖ్యంగా రైల్వేకోడూరు విషయంలో స్థానిక ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, ఎంపీ మిథున్‌రెడ్డితో కలిసి సీఎం జగన్ మోహన్‌రెడ్డి ద్వారా ఢిల్లీకి వెళ్లి కేంద్రమంత్రులతో చర్చించి ఇక్కడ సుమారు రూ.2వేల కోట్లతో గ్రీన్ ఎక్స్‌ప్రెస్ హైవేను మంజూరు చేయించారన్నారు. ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు విత్తనం నుంచి పంటకు గిట్టుబాటు కలిగించే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్ల రూపాయలతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేశారన్నారు. రైతులకు అండగా ఉండాలనే ఉద్దేశంతోనే రైతుభరోసా కేంద్రాలకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, సూరపురాజు శివరామరాజు, ముప్పాల హేమనవర్మ, వేణుగోపాల్‌రాజు, గునిశెట్టి ప్రశాంతిరమేష్, జెట్పీటీసీ రత్నమ్మ, సర్పంచ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి తీసుకెళ్లాలి

రైల్వేకోడూరు : ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి తీసుకువెళ్లాలని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు అధ్యక్షతన సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో మా నమ్మకం నువ్వే జగన్ , గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మనం చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించాలన్నారు. అన్నమయ్య డీసీసీబీ చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, చిత్తూరు డీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు అండగా నిలవాలి

రాష్ట్ర అభివృద్ధికోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండలంలోని అనంతరాజుపేట 2 సచివాలయం పరిధిలోని తూర్పుపల్లె ఎస్టీకాలనీ, లక్ష్మీనగర్ దళితవాడలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన జీవితం అందించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు.

త్వరితగతిన జగనన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ గిరిషా పీఎస్

కురబలకోట: జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సూచించారు. బుధవారం ఆయన కురబలకోట మండలంలోని కడప క్రాస్, బ్రాహ్మణ ఒడ్డుపల్లె, కంటేవారిపల్లెలో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి. ఇబ్బందులేమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అధికారులు కూడా ఇళ్ల నిర్మాణాల పూర్తిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అలసత్వం వహించే అధికారులు, ఉద్యోగులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్డీఓ మురళీ, హౌసింగ్ పీడీ శివయ్య, ఎంపీపీ బి. దస్తగిరి, ఎంపీడీఓ దిలీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేలు అందించాలి

రాయచోటి: ప్రభుత్వ శాఖలద్వారా సంతృప్త స్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. బుధవారం విజయవాడ నుంచి ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి నారాయణ భరత్‌గుప్త, ప్రత్యేక ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్యలు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, డీఆర్‌ఓ సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవరత్నాలు పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలలో ఆయా శాఖల ద్వారా ప్రజలకు నాణ్యమైన, మెరుగైన సేవలను సంతృప్త స్థాయిలో అందించాలని జిల్లా అధికారులను ఆదేశించారు.



కురబలకోటలోని బ్రాహ్మణ ఒడ్డుపల్లె జగనన్న కాలనీలో జిల్లా కలెక్టర్ గిరిషా

వైఎస్సార్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా శ్రీనివాస్ ఆంజనేయమూర్తి

కడప అర్బన్ : వైఎస్సార్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా కృష్ణా జిల్లా విజయవాడ రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తిగా పనిచేస్తున్న వి.శ్రీనివాస ఆంజనేయ మూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు హైకోర్టు నుంచి బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వైఎస్సార్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన సోల్మన్‌రాజు గతేడాదిలో ఉద్యోగ విరమణ పొందారు. తాజాగా వెలువడిన న్యాయమూర్తుల బదిలీల ఉత్తర్వుల్లో జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి నియమితులయ్యారు.

సీనియర్ సివిల్ జడ్జిల బదిలీలు

కడపలోని ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి ఎస్.హేమలతను ప్రకాశం జిల్లా ఒంగోలు అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా,వైఎస్సార్ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి కవితను కడపలోని ప్రధాన సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. రాజంపేట సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎస్.సరస్వతిని తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం జడ్జిగా బదిలీ చేశారు. కర్నూలు సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న టి.కేశవను రాజంపేట కోర్టుకు బదిలీ చేశారు.

సమ్మేటివ్‌కు సర్వం సిద్ధం

- నేటి నుంచి ఎఫ్‌ఏ-2 పరీక్షలు ప్రారంభం
- పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ
- 1 నుంచి 8 వరకు సీబీఏ విధానంలో పరీక్ష నిర్వహణ
- 9వ తరగతికి పాత పద్ధతిలోనే పరీక్ష



కడప ఎడ్యుకేషన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులకు వార్షిక పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ఇందులో 1 నుంచి 5వ తరగతి వరకు ఈనెల 20 నుంచి 26 వరకు, 6 నుంచి 9 తరగతులకు 20 నుంచి 29 వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. తీవ్రమైన ఎండల నేపథ్యంలో విద్యార్థుల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పరీక్షల వేళల్లో స్వల్ప మార్పులు చేశారు. ఇందులో 1 నుంచి 8వ తరగతుల విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్న 12 గంటల వరకు జరగాల్సిన పరీక్షలను ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్నారు. అలాగే 9వ తరగతికి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పరీక్ష నిర్వహించనుండగా ఉదయం 8 గంటల నుంచి 11.15 గంటల వరకు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు సంబంధించిన పశ్నాపత్రాలను కడప డీసీఈబీ నుంచి మండల కేంద్రాలకు తరలించి ట్రంకు పెట్టెలో భద్రపరిచారు. నేటి నుంచి ప్రారంభం కానున్న వార్షిక పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. ఈ పరీక్షలను ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా 3,22,948 మంది విద్యార్థులు రాయనున్నారు.

సీబీఏ విధానంలో...

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన లోపాలను గుర్తించడంతోపాటు వారి సామర్థ్యాలను వెలికి తీయడం సీబీఏ పరీక్షల ప్రధాన ఉద్దేశం. గుణాత్మక విద్యను అందించడంతోపాటు ఉత్తమ విద్యా ప్రమాణాలను పెంచేందుకు ఈ విధానం ఎంతో దోహదపడుతుంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఎస్‌సీఈఆర్టీ సీబీఏ విధానాన్ని కొన్ని పరీక్షలకు అమలు చేస్తున్నారు. ఎఫ్‌ఏ-1, ఎఫ్‌ఏ-3 పరీక్షలను ఇప్పటికే సీబీఏ విధానంలో అమలు చేశారు. ఎఫ్‌ఏ-4 సమ్మేటివ్-1 పరీక్షలను పాత విధానంలో నిర్వహించారు. ప్రస్తుతం నిర్వహించనున్న సమ్మేటివ్ -2 పరీక్షలను ఓఎంఆర్ విధానంలో విద్యార్థులు రాయాల్సి ఉంది. ఇందుకు సంబంధించి ఓఎంఆర్ షీట్లను కడప డీసీఈబీ నుంచి మండల కేంద్రాలకు తరలించారు.

టైం టేబుల్ విడుదల

సమ్మేటివ్-2 పరీక్షలకు సంబంధించిన టైమ్ టేబుల్‌ను ఎస్‌సీఈఆర్టీ విడుదల చేసింది. పరీక్షల నిర్వహణ అనంతరం జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి ఫలితాలను ఆన్‌లైన్‌లో పొందు పరచాలని పాఠశాల విద్యాశాఖ సూచించింది. 1,2 తరగతులకు 20న తెలుగు, 24న ఇంగ్లిష్, 25న గణితం, 3,5 తరగతులకు 20న తెలుగు, 24న ఇంగ్లిష్, 25న గణితం, 26న పరిసరాల విజ్ఞానం, 6, 9 తరగతులకు 20న తెలుగు, 24న హిందీ, 25న ఇంగ్లిష్, 26న గణితం, 27న జనరల్ సైన్సు, 28న సోషియల్ , 29న కాంపోజిట్ కోర్సులు పేపర్-1, మే 4న కాంపోజిట్ కోర్సులు పేపర్-2 పరీక్షలను నిర్వహించనున్నారు.

బైలింగ్విష్ విధానంలో ప్రశ్నపత్రం..

సీబీఏ విధానంలో విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నపత్రం బైలింగ్విష్(ద్విభాష) విధానంలో ఉంటుంది. ఇప్పటి వరకు ఇంగ్లిష్ మీడియం వారికి ఆంగ్లంలో, తెలుగు మీడియం వారికి తెలుగులో ప్రశ్నపత్రం ఇస్తున్నారు. ఇప్పటికే పాఠ్యపుస్తకాలను బైలింగ్విష్ పద్ధతిలో ముద్రించిన విద్యాశాఖ తాజాగా నూతన విధానంలో బైలింగ్విష్‌లో ప్రశ్నపత్రం రూపొందించారు. దీని వలన విద్యార్థికి ఇంగ్లిష్‌లో ప్రశ్న అర్థం కాకపోతే తెలుగులో చదివి అర్థం చేసుకుంటాడు. ప్రశ్నలను ఆబ్జెక్టివ్ విధానంలో ఇస్తారు. 1 నుంచి 5వ తరగతులకు ఒక్క ఓఎంఆర్, 6 నుంచి 8 తరగతులకు రెండు ఓఎంఆర్‌లు ఇవ్వనున్నారు. లాంగ్వేజ్, నాన్ లాంగ్వేజ్ పరీక్షలకు వేర్వేరు ఓఎంఆర్‌లను వినియోగిస్తారు.

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో అన్ని యాజమాన్య పాఠశాలలు, విద్యార్థుల వివరాలు ఇలా...

యాజమాన్యం	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రభుత్వ ప్రైమరీ స్కూల్స్	2174	1,33,788
ప్రభుత్వ హైస్కూల్స్	458	1,00,724
ప్రైవేటు ప్రైమరీ స్కూల్స్	235	4376
ప్రైవేటు హైస్కూల్స్	424	84060
మొత్తం	3271	3,22,948

కమిషనర్ ఆదేశాల మేరకు..



కమిషనర్ ఆదేశాలకు పైలెట్ స్టడీ కింద జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో కలిసి 1000 మంది విద్యార్థులను ఎంపిక చేశాము. వీరందరికి క్లాస్ రూమ్ బేస్డ్ అసిస్మెంట్ విధానంలో పరీక్ష నిర్వహించనున్నాము. ఇందుకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశాము, ఇందుకోసం ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 178 పాఠశాలలను ఎంపిక చేశాము. ఈ పరీక్ష మండల విద్యాశాఖ అధికారి పర్యవేక్షణలో సీఆర్‌పీలు మానిటరింగ్ చేస్తారు.

– శోభారాణి, డీసీఈబీ సెక్రటరీ, కడప.

కట్టుదిట్టంగా పరీక్షల నిర్వహణ



సమ్మేటివ్-2 పరీక్షల నిర్వహణను చాలా కట్టుదిట్టంగా నిర్వహించేలా అన్ని సూచనలు, సలహాలను ఇచ్చాము. ఎక్కడేకానీ ప్రశ్నాపత్రం లీకేజీ కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని ఎంఈఓలకు, హెచ్‌ఎంలకు ఆదేశాలను జారీ చేశాము. పరీక్ష పూర్తి అయిన వెంటనే ఉపాధ్యాయులు పేపర్ మూల్యాంకనం చేసి విద్యార్థులకు సమాధాన పత్రాలను ఇచ్చి మార్కులను సెంట్రల్ మార్కుల రిజిస్టర్‌లలో, ప్రోగ్రెస్ కార్డులలో నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

– ఎద్దుల రాఘవరెడ్డి, డీఈఓ, వైఎస్సార్ జిల్లా

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వివరాలు.. మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లెకు చెందిన ప్రశాంత్ భార్య మేరీ (35) కూలీ పనులు చేస్తూ జీవిస్తోంది. ఈ క్రమంలో బుధవారం కుటుంబ సమస్యల కారణంగా భర్తతో గొడవపడింది. అనంతరం మనస్తాపంతో పురుగుల మందు తాగింది. అదే విధంగా బి.కొత్తకోట మండలం సామడపల్లెకు చెందిన రవీంద్ర భార్య మంజుల (34) వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తోంది. ఈ క్రమంలో గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. దీంతో మనస్తాపానికి గురై బుధవారం గులికల మందు తినింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుల్ని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

యువకుడిపై దాడి

మదనపల్లె : భార్యాభర్తలు గొడవ పడుతుండగా అడ్డు వచ్చిన ఓ యువకుడిపై భర్త కత్తితో దాడి చేసి గాయపరచిన సంఘటన బుధవారం మదనపల్లె మండలంలో జరిగింది. కొత్తపల్లె పంచాయతీ కొత్తయిండ్లకు చెందిన సద్దాం హుస్సేన్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో సద్దాం తన భార్య ముంతాజ్‌లు కొద్ది రోజులుగా తరచూ గొడవ పడుతున్నారు. బుధవారం కుటుంబ సమస్యల కారణంగా మరోమారు గొడవ పడుతుండగా అదే ప్రాంతానికి చెందిన వరుసకు వీరికి బంధువైన సాధిక్ (25) అడ్డుపడ్డారు. దీంతో ఆవేశానికి గురైన సద్దాం ఇంట్లోని కత్తితో సాధిక్‌పై దాడి చేశాడు. సద్దాం తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కువైట్ నుంచి మదనపల్లెకు..

కోమా బాధితుడు కుటుంబసభ్యుల వద్దకు



షేక్ అబ్దుల్‌బాషాను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం

మదనపల్లె : బతుకుతెరువు కోసం ఎడారిదేశాలకు వెళ్లి, అనారోగ్యం పాలై కోమాలోకి చేరుకున్న ఓ అభాగ్యుడిని కుటుంబసభ్యుల కోరిక మేరకు ఇంటికి చేర్చి మానవత్వం చాటుకున్న ఘటన బుధవారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని దేవళంవీధికి చెందిన షేక్ పీరాన్‌సాహెబ్ కుమారుడు షేక్ అబ్దుల్ బాషా(50)కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ పోషణకు ఉపాధిలో భాగంగా ఐదేళ్ల క్రితం కువైట్‌కు వెళ్లాడు. అక్కడ పనిచేస్తున్న క్రమంలో పక్షవాతం సోకి అనారోగ్యానికి గురయ్యాడు. తీవ్ర అస్వస్థతతో కోమాలోకి వెళ్లిపోయాడు. ఆరునెలలుగా అక్కడే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడిని తిరిగి ఇండియాకు తీసుకొచ్చేందుకు కుటుంబసభ్యులకు ఆర్థికస్తోమత లేకపోవడం, ఎవరిని సంప్రదించాలో, ఎలా రప్పించాలో తెలియకపోవడంతో ఆవేదన చెందుతుండేవారు. ఈ నేపథ్యంలో షేక్ అబ్దుల్‌బాషా భార్య, బిడ్డలు తమ భర్తను, తండ్రిని కడచూపు చూసుకునేందుకు తమకు అవకాశం కల్పించాలని, ఎలాగైనా తమ తండ్రిని దేశానికి తీసుకురావాల్సిందిగా ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం , కౌన్సిలర్ రెహమాన్‌కు విన్నవించారు. స్పందించిన షమీంఅస్లాం కువైట్ ఎంబసీ అధికారులను సంప్రదించారు. షేక్‌అబ్దుల్‌బాషా పనిచేస్తున్న కంపెనీ ప్రతినిధులను సంప్రదించి, స్థానికంగా నివాసం ఉంటున్న తెలిసిన వ్యక్తులను అక్కడికి పంపించి 15 రోజులుగా కువైట్‌కు చెందిన వారితో సంప్రదింపులు జరుపుతూ అవసరమైన అనుమతి పత్రాలన్నింటినీ సమర్పించారు. ఎట్టకేలకు మంగళవారం రాత్రి కువైట్ నుంచి మద్రాస్ ఎయిర్‌పోర్టుకు తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. బుధవారం ఉదయం 6 గంటలకు మద్రాస్ ఎయిర్ పోర్టుకు చేరుకున్న అబ్దుల్‌బాషాను ప్రత్యేక అంబులెన్స్‌లో మధ్యాహ్నం 2 గంటలకు పట్టణంలోని దేవళంవీధికి తీసుకొచ్చారు. కోమాలో ఉన్న భర్తను చూసిన భార్య, తండ్రిని అలా చూసిన పిల్లలు కన్నీటిపర్యంతమయ్యారు. కుటుంబసభ్యుల ఆర్ద్రతను, ఆవేదనను అర్థం చేసుకున్న షమీంఅస్లాం పట్టణంలోని వైద్యులను సంప్రదించి వైద్యసేవలు అందించేందుకు ఒప్పించారు. రంజాన్ నెలలో తమ కోరికను తీర్చి అబ్దుల్‌బాషాను ఇంటికి చేర్చినందుకు కుటుంబసభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సారా ఊట ధ్వంసం

ములకలచెరువు : ములకలచెరువు మండలంలో సారా ఊట ధ్వంసం చేసినట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక బుధవారం తెలిపారు. మండలంలోని మద్దినాయునిపల్లి పంచాయతీ గడ్డు రాజులపల్లె సమీపంలో సారా వండుతున్నట్లు ముందస్తు సమాచారంతో సిబ్బందితో కలిసి 200 లీటర్ల సారా ఊట ధ్వంసం చేసినట్లు సీఐ చెప్పారు.

ట్రాక్టర్ బోల్తా : ఇద్దరికి తీవ్రగాయాలు



గాయపడిన వెంకట్రామయ్య

నిమ్మనపల్లె : ట్రాక్టర్ బోల్తాపడి ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం మేలుందొడ్డి పంచాయతీ గోపిశెట్టిపల్లెకు చెందిన వెంకట్రామయ్య (55) కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. బుధవారం అదే గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మంజునాథ్ (30)తో కలిసి సెంట్రింగ్ మెటీరియల్ ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని నిమ్మనపల్లెకు బయలుదేరారు. బోయకొండ సమీపంలో బండ్లపై గ్రామం వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో వెంకట్రామయ్య తీవ్రంగా, డ్రైవర్ మంజునాథ్ స్వల్పంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

సిద్దవటం : సిద్దవటం గ్రామ సమీపంలోని పెన్నాది అవతలి వైపు ఉన్న ఓబులమ్మ వంక వద్ద నెల్లూరు జిల్లాకు చెందిన కొప్పోల్ల బాబు (46) బుధవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు ప్పాడ్డారని స్థానికులు తెలిపారు. అతని వద్ద ఉన్న ఆధార్ కార్డు ప్రకారం నెల్లూరు జిల్లా పెనుబర్తి గ్రామానికి చెందిన కొప్పోల్ల కొండయ్య కుమారుడు కొప్పోల బాబుగా గుర్తించామన్నారు. ఈయన ఆత్మహత్యకు కారాణాలు తెలియాల్సి ఉందని అన్నారు.

నకిలీ కరెన్సీ నోట్లతో బెంబేలు



నకిలీ రూ.500ల కరెన్సీ నోటు

పెద్దతిప్పసముద్రం : మండలంలో నకిలీ కరెన్సీ నోట్లు హల్‌చల్ చేస్తుండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ప్రధానంగా చిల్లర దుకాణాలు, టీ స్టాల్స్, హోటళ్ల యజమానులు ఏది అసలు, ఏది నకిలీ నోటో అర్థం కాక తికమక పడుతున్నారు. అసలు నోట్లకు ఏ మాత్రం తీసిపోని విధంగా ముద్రితమై చలామణి అవుతుండటంతో అమాయకులు మోసపోతున్నారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రానికి చెందిన మహిళా సంఘాల సంఘమిత్ర గ్రూపుకు సంబంధించిన డబ్బులను జమ చేసేందుకు స్థానికంగా ఉండే ఎస్‌బీఐకు వెళితే అందులో ఒక రూ.500ల నోటు నకిలీ కరెన్సీ నోటుగా బ్యాంకు సిబ్బంది నిర్ధారించారు. ఆ నోటు ఎవరు ఇచ్చారో,ఎవరిని అడగాలో తెలియక సదరు సంఘమిత్ర నకిలీ నోటుకు బదులుగా తన వద్ద ఉన్న సొంత డబ్బును బ్యాంకులో జమ చేసింది. పోలీసులు నకిలీ కరెన్సీ నోట్ల చలామణిపై నిఘా వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఫ్రూట్ కవర్లతో మామిడిలో నాణ్యమైన దిగుబడి

నిమ్మనపల్లె : మామిడి కాయలకు ఫ్రూట్ కవర్లు తొడగటం ద్వారా పంటలో అధిక దిగుబడి పొందవచ్చని కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వై.పీరుసాహెబ్, ఏడీఏ డాక్టర్ ఎంవీ.శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండలంలోని వెంగంవారిపల్లె గ్రామానికి చెందిన కె.నరసింహులు గుప్త మామిడితోటలో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. మామిడి కాయలకు ఫ్రూట్ కవర్ల తొడుగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మామిడి పంటను పండు ఈగ, తామర పురుగులు, కాయ తొలుచు పురుగు, మసి మంగు తదితర తెగుళ్లు ఆశిస్తాయమన్నారు. వీటిని మొదటి దశలో గుర్తించడం రైతులకు కష్టసాధ్యమని తెలిపారు. అయితే ఈ పరిస్థితిని అధిగమించేందుకు 15 నుంచి 20 అడుగులు ఎత్తు ఉన్న మామిడి చెట్ల కాయలు కోడిగుడ్డు సైజులో ఉన్న సమయంలో ఫ్రూట్ కవర్లు (కాయ తొడుగులు) అమర్చితే మెరుగైన దిగుబడి సాధించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ జయకృష్ణవేణి, రైతులు పాల్గొన్నారు.

పదేళ్ల కుమారుడికి ప్రాణభిక్ష పెట్టండి

– దాతలు ఆదుకోవాలని తల్లి వినతి



మాట్లాడుతున్న కల్పన

మదనపల్లె : పెద్దపేగుపై చర్మం పెరిగి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న తన పదేళ్ల కుమారుడికి ప్రాణభిక్ష పెట్టాల్సిందిగా తల్లి కల్పన దాతలను వేడుకుంది. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులకు కల్పన తన కుమారుడి ఆరోగ్య పరిస్థితిని వివరించింది. పట్టణంలోని చలపతిరావు కాలనీలో తాము నివాసం ఉంటున్నామని, తన భర్త చలపతిరావు హోటల్‌లో సర్వర్‌గా పనిచేస్తుండగా, తాను టైలరింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపింది. తమ ఒక్కగానొక్క కుమారుడు హేమంత్‌కుమార్ పుట్టుకతోనే అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నాడని, తిరుపతి, బెంగళూరులోని పెద్ద ఆస్పత్రుల్లో వైద్యపరీక్షలు చేయిస్తే పెద్దప్రేగు వ్యాధిగా వైద్యులు నిర్ధారించారని చెప్పింది. దీనికి సంబంధించి శస్త్రచికిత్స నిర్వహించేందుకు బిడ్డ వయస్సు సరిపోకపోవడంతో మందుల సహాయంతో పదేళ్లుగా నెట్టుకువచ్చినట్లు తెలిపింది. ఇటీవల బెంగళూరులోని సెయింట్‌జాన్ హాస్పిటల్‌కు చెందిన వైద్యులు హేమంత్‌కుమార్‌ను పరీక్షించి ఆపరేషన్ చేస్తే కోలుకునే అవకాశం ఉందని, సుమారు రూ.5లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపినట్లు చెప్పింది. రోజువారీ కూలిపనులతో సంసారాన్ని నెట్టుకొస్తున్న తమకు బిడ్డకు ఆపరేషన్ చేయించే స్తోమత లేదని వాపోయింది. మనసున్న దాతలు స్పందించి ఆపరేషన్‌కు ఆర్థికసహాయం అందించాలని వేడుకుంది. భర్త చలపతిరావు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారని తెలిపింది. కుమారుడు హేమంత్‌కుమార్ ఆపరేషన్‌కు సహాయం చేయాలనుకునే దాతలు 9502768558 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపింది.

తండ్రి, కుమారుడిపై హత్యాయత్నం



తీవ్రంగా గాయపడిన కిరణ్‌కుమార్

మదనపల్లె : తండ్రి, కుమారుడిపై అదే గ్రామానికి చెందిన వ్యక్తులు దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. బాధితుల కథనం మేరకు వివరాలు.. బి.కొత్తకోట పట్టణంలోని పీటీఎం రోడ్డులో నివాసమున్న రామాంజనేయులు (67) ఆయన కుమారుడు కిరణ్ కుమార్ (30) బెంగళూరు రోడ్డులో టింబర్‌డిపో నిర్వహిస్తూ జీవిస్తున్నారు. బుధవారం తమ టింబర్ డిపో చుట్టూ ఉన్న ఖాళీ స్థలంలో ప్రహరీగోడ నిర్మిస్తుండగా, అక్కడికి చేరుకున్న కంచె లోకేష్‌రెడ్డి, అతని చిన్నాన్న కంచె రెడ్డెప్పరెడ్డి, కిరణ్‌కుమార్‌తో వాగ్వాదానికి దిగి గొడవ పెట్టుకున్నారు. అకస్మాత్తుగా రాడ్లు, కొడవళ్లతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన రామాంజనేయులు వెంటనే కుమారుడికి అడ్డుగా వెళ్లేందుకు ప్రయత్నించాడు. దీంతో నిందితులు ఆయనపై దాడి చేశారు. దాడిలో కిరణ్‌కుమార్, రామాంజనేయులు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. ఈ ఘటనపై బి.కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

కాశీ యాత్రలో అపశ్రుతి

రైలులో అస్వస్థతకు గురై ఒకరు మృతి



వెంకటరెడ్డి మృతదేహం

బి.కొత్తకోట : చావు, పుట్టుక మన చేతుల్లో లేదంటారు. ఎలా రాసుంటే అట్ల జరుగుతుందని కూడా అంటారు. ఇది గుంతావారిపల్లెకు చెందిన గ్రామస్తుడికి సరిగ్గా సరిపోతుంది. ఆలయాల దర్శనం కోసం వెళ్లిన వ్యక్తి ఆలయ దర్శన ప్రాప్తి కలగనే మృత్యుఒడికి చేరిన విషాద ఉదంతం ఇది. కాశీ యాత్రకు వెళ్లిన బృందంలో ఒకరు బుధవారం ఉదయం మధురలో మృతి చెందాడు. యాత్ర ప్రారంభంలోనే అపశృతి చోటుచేసుకోవడంతో యాత్ర ఆగిపోయింది. వివరాలు..బి.కొత్తకోట మండలం శీలంవారిపల్లె పంచాయతీ గుంతావారిపల్లెకు చెందిన పి.వెంకటరెడ్డి (69), కే.శేఖర (30), ఎల్.సరస్వతి (45), డి.మునిస్వామి (65), జే.శంకరమ్మ (45), జే.పద్మావతమ్మ (60), పి.రఘునాథరెడ్డి (52), ఆర్.శాంతమ్మ (65), రామస్వామి (70) బృందం కాశీ, మధురలకు సోమవారం బయలుదేరారు. ఉదయం ములకలచెరువు నుంచి రైలులో ధర్మవరం వెళ్లి అక్కడినుంచి సికింద్రాబాద్‌కు, అక్కడినుంచి ఉత్తరప్రదేశ్‌లోని మధుర రైలులో బయలుదేరారు. బుధవారం ఉదయం ఆరు గంటలకు రైలు మధుర చేరుకుంది. అందరూ దిగుతుండగా సీటులో కూర్చున్న పి.వెంకటరెడ్డి (69) అస్వస్థతకు గురై లేవలేని స్థితిలో ఉండటంతో తోటి గ్రామస్తులు సపర్యలు చేశారు. తర్వాత ఆటోలో స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం అందించేందుకు ప్రయత్నించేలోపే మృతి చెందాడు. దీంతో బృందంలో మిగతా సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఆలయాల దర్శన యాత్ర ఆదిలోనే ఆగిపోయింది. ఊరుకాని ఊరులో మృతదేహాన్ని గ్రామానికి ఎలా తరలించాలో తెలియని దిక్కుతోచని స్థితిలో ఉండగా..సమాచారం అందుకున్న గుంతావారిపల్లెకు చెందిన పవర్‌వాటర్‌టెక్ సంస్థ ఎండీ బి.పద్మనాభరెడ్డి వెంటనే బెంగళూరు నుంచి విమానంలో మధుర చేరుకున్నారు.ఆయన అక్కడి పోలీసులు, అధికారులతో మాట్లాడుతున్నారు. ఈ విషయాన్ని రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి సమాచారం ఇవ్వగా అవసరమైన సహకారం అందిస్తానని ఎంపీ చెప్పారు.

అత్తింటివారిపై వేధింపులు, చీటింగ్ కేసు

మదనపల్లె : వివాహిత ఫిర్యాదు మేరకు అత్తింటివారిపై వరకట్న వేధింపులు, చీటింగ్ కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు. పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన తేజకు ఏడాది క్రితం విశాఖపట్నంకు చెందిన శశికాంత్‌తో వివాహమైంది. దంపతులిద్దరూ హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పని చేస్తున్నారు. అయితే శశికాంత్ దాంపత్య జీవితానికి పనికిరాడని తెలిసినా తనను మోసగించి పెళ్లి చేశారని బాధితురాలు తేజ ఆరోపిస్తూ ఇటీవల పుట్టింటికి వచ్చింది. అనంతరం అత్తింటివారి చేసిన మోసంపై టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు భర్త శశికాంత్ అతని కుటుంబ సభ్యులైన సుధాకర్‌రావు, పద్మలత, వికాస్, స్నేహలపై చీటింగ్, వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.